

కదిలిన పసుపు దండు

● నగరంలో టీడీపీ భారీ రోడ్‌షో ● తోడుగా జనసేన శ్రేణులు

విజయనగరం రూరల్, మార్చి 12: విజయనగరంలో పసుపు దండు కదిలింది. జనసేన తోడైంది. టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి అదితి గజపతిరాజును గెలిపించాలని కోరుతూ నగరంలోని 20, 21, 22, 23, 24 టీడీపీ డివిజన్ కమిటీలు, టీడీపీ నాయకులు మంగళవారం భారీ రోడ్‌షో నిర్వహించారు. ర్యాలీ 22వ డివిజన్ పరిధిలోని టీడీపీ నాయకుడు కంది మురళీనాయుడు, కంది శమంతకమణి ఇంటి వద్ద నుంచి ప్రారంభమైంది. సాయంత్రం 4 గంటలకు ఆ ప్రాంతానికి వచ్చిన అదితి గజపతిరాజుకు నగర, మండల, నియోజకవర్గ నాయకులు స్వాగతం పలికారు. అనంతరం ఓపెన్‌టాప్ జీప్‌లో అదితి, జనసేన నాయకురాలు పాలవలస యశస్విని ముందుండగా టీడీపీ నాయకులు ఐవీపీ రాజు, ప్రసాదుల ప్రసాద్, బొద్దల నర్సింగరావు, గంటా పోలినాయుడు తదితరులు వెంట ఉన్నారు. ర్యాలీకి ముందు పులివేషాలు, బిందెల నృత్యాలు, టీడీపీ పాటలకు కార్యకర్తల నృత్యాలతో సందడి నెలకొంది. ప్రజలంతా బయటకు వచ్చి అదితి గజపతిరాజుకు హారతులు పట్టారు. అనంతరం ఆమె మాట్లాడుతూ, రాష్ట్ర భవిష్యత్తు దృష్ట్యా టీడీపీ-జనసేన-బీజేపీ కూటమిగా ముందుకొచ్చాయని, మద్దతు ఇచ్చి చంద్రబాబు నాయకత్వాన్ని బలపరచాలన్నారు. సైకిల్ గుర్తుపై ఓటేసి తనను గెలిపించాలని అభ్యర్థించారు.



భారీగా హాజరైన టీడీపీ-జనసేన శ్రేణులు



ప్రజలను పలకరిస్తున్న అదితి, యశస్విని



ఆనందంతో వృద్ధురాలి నృత్యం

టిక్కెట్‌పై ఉత్కంఠ

● పొత్తు సరే.. ఇక్కడెవరో?
● విజయనగరంలో బీజేపీ అభ్యర్థి ఎవరన్నదానిపై లోతుగా ఆరా
● ఎంపీ సీటు టీడీపీకి ఇవ్వాలంటున్న కొందరు

(విజయనగరం- ఆంధ్రజ్యోతి)



బీజేపీతో పొత్తు ఉంటుందా లేదా అన్నదానిపై మొన్నటి వరకు ఉన్న సందేహం నివృత్తి అయింది. బీజేపీకి రాష్ట్రంలో ఆరు లోక్‌సభ, 10 అసెంబ్లీ సీట్లు ఇచ్చేందుకు నిర్ణయించారు. విజయనగరం లోక్‌సభ నియోజకవర్గాన్ని బీజేపీకి కేటాయించినట్లు తాజాగా వార్తలు వచ్చాయి. అయితే విశాఖ లోక్‌సభను బీజేపీకి కేటాయించి విజయనగరం లోక్‌సభను టీడీపీకి కేటాయించాలని తెలుగుదేశం పార్టీ నాయకులు కోరుతున్నారు. ముఖ్యంగా నెల్లిమర్ల నియోజకవర్గం నుంచి ఎక్కువగా ఈ డిమాండ్ వినిపిస్తోంది. మాజీ ఎంపీపీల ఆధ్వర్యంలో ఆయా మండలాల్లోని నాయకులు ఇదే విషయమై మంగళవారం చర్చించుకున్నారు. నెల్లిమర్ల అసెంబ్లీని జనసేనకు కేటాయించడం.. నియోజకవర్గంలో భారీగా ఆశలు పెట్టుకున్న కర్రోతు బంగార్రాజుకు నిరాశ ఎదురుకావడం తరుణంలో పార్లమెంట్ సీటు విషయంలో సుదీర్ఘ చర్చలు సాగుతున్నాయి. లోక్‌సభ సీటు కోసం బంగార్రాజు, కడగల ఆనంద్‌కుమార్, డెంకాడ మాజీ ఎంపీపీ కంది చంద్రశేఖర్ పేర్లు ప్రచారంలోకి వచ్చాయి. తాజాగా బీజేపీతో ఏర్పడిన పొత్తు ఫలితంగా విజయనగరంలో బీజేపీ పోటీ చేస్తుందన్న అంచనాలు మంగళవారం బయటకు పొక్కాయి. ఆశలు పెట్టుకున్న నాయకులు కాస్తా నిరుత్సాహానికి గురయ్యారు. చీపురుపల్లి అసెంబ్లీకి గంటా శ్రీనివాసరావు వస్తే టీడీపీ పార్లమెంట్ జిల్లా అధ్యక్షునిగా ఉన్న కిమిడి నాగార్జున బరిలో ఉంటారన్న ప్రచారం కూడా సాగింది.

విజయనగరం పార్లమెంటరీ పరిధిలో విజయనగరం, నెల్లిమర్ల, చీపురుపల్లి, రాజాం, బొబ్బిలి, గజపతినగరం, శ్రీకాకుళం జిల్లాలోని ఎచ్చెర్ల నియోజకవర్గాలున్నాయి. పార్లమెంట్ స్థానం బీజేపీకి కేటాయిస్తే అభ్యర్థి ఎవరన్న దానిపైనా చర్చ సాగుతోంది. గత ఎన్నికల్లో పాకలపాటి సన్యాశిరాజు బీజేపీ ఎంపీ అభ్యర్థిగా పోటీ చేశారు. ఈసారి మాజీ ఎమ్మెల్సీ మాధవ్ పేరు విన్పిస్తోంది. ఎవరికి కేటాయిస్తారన్నది అధికారికంగా తేలాల్సి ఉంది.

త్వరగా ఏర్పాట్లు పూర్తి కావాలి: కలెక్టర్

కలెక్టరేట్, మార్చి 12: ఎన్నికలకు సంబంధించి పాత ట్రెజరీ కార్యాలయంలో కేటాయించిన కంట్రోల్ రూంలో అన్ని రకాల ఏర్పాట్లను రెండు రోజుల్లో పూర్తి చేయాలని కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశించారు. జేసీ కార్తీక్, డీఆర్వో అనితతో కలిసి కంట్రోల్ రూమ్‌ను ఆమె మంగళవారం సందర్శించారు. కంట్రోల్ రూంలో ఎన్నికలకు సంబంధించిన ఫిర్యాదులు, ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా వార్తల మానిటరింగ్ తదితర సేవలకు సంబంధించి అధికారులు, సిబ్బందిని నియమించారు. పోలింగ్ రోజు వెబ్‌కాస్టింగ్ ద్వారా పర్యవేక్షణకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని సూచించారు. అందుకు అవసరమైన టీవీలు, కంప్యూటర్లు, ప్రింటర్లు, జిరాక్స్, ఇంటర్నెట్ మైక్ సిస్టం, టేబుళ్లు, కుర్చీలు, ఇతర సదుపాయాలను రెండు రోజుల్లో పూర్తి చేయాలన్నారు. ఈ సందర్భంగా ఓటు విలువను తెలిపే పోస్టర్లను కలెక్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో సహాయ కలెక్టర్ వెంకట్ త్రివినాగ్, సీపీవో బాలాజీ, జడ్పీ సీఈవో రాజకుమార్, హౌసింగ్ పీడీ శ్రీనివాసరావు, డీపీఆర్వో రమేష్ తదితరులు పాల్గొన్నారు.



దశాబ్దాలుగా ప్రభుత్వ గృహ నిర్మాణ పథకాల కింద మంజూరైన ఇళ్లను క్రమబద్ధీకరిస్తాం. నిర్ణీత ఫీజు చెల్లిస్తే చాలు ఇక ఇళ్లు స్వయంగా మీ పేరునే రిజిస్ట్రేషన్ చేస్తాం అంటూ ఓటీఎస్ పథకాన్ని తెరపైకి తీసుకొచ్చిన వైసీపీ ప్రభుత్వం జిల్లాలో దాదాపు రూ.12 కోట్లు వసూలు చేసింది. ఆయా లబ్ధిదారులు డబ్బులిచ్చి రెండేళ్లు దాటినా నేటికీ గృహహక్కు పత్రాలు పొందలేదు. ఎన్నికలు వచ్చేస్తుండడంతో పథకం అమలుపై సందేహం వ్యక్తం చేస్తున్నారు.



ఓటీఎస్.. తుస్

● జగనన్న సంపూర్ణ గృహ హక్కు పథకం అపహాస్యం ● ఇంటి హక్కుకు దిక్కులేదు ● చెల్లుబాటుకాని రిజిస్ట్రేషన్లు
● ఆ రూ.12 కోట్ల వసూలు సంగతేంటి? ● ఆశగా ఎదురుచూస్తున్న లబ్ధిదారులు



నెల్లిమర్ల, మార్చి 12: జిల్లాలో ఓటీఎస్ పథకం అపహాస్యమైంది. ఎన్టీఆర్ హయాం నుంచి కిరణ్‌కుమార్‌రెడ్డి ప్రభుత్వం వరకూ గృహ నిర్మాణ పథకంలో భాగంగా మంజూరైన ఇళ్ల కోసమంటూ వైసీపీ సర్కారు జగనన్న సంపూర్ణ గృహ హక్కు పథకం తీసుకొచ్చిన సంగతి తెలిసిందే. దశాబ్దాల కిందట నిర్మించిన ఇళ్లకు కొలతలు తీసి సంపూర్ణ గృహహక్కు కల్పిస్తామని నమ్మబలికింది. చాలామంది నుంచి కోట్లాది రూపాయలు కట్టించుకుంది. ఇది జరిగి రెండున్నరేళ్లు గడుస్తున్నా సంపూర్ణ గృహహక్కు పత్రాలు ఇంతవరకూ మంజూరు చేయలేదు. మరోవైపు చూస్తే ఎన్నికలు సమీపిస్తున్నాయి. డబ్బులు కట్టినవారంతా ఆందోళన చెందుతున్నారు. తమ డబ్బులైనా తిరిగి ఇవ్వాలని..లేకుంటే ధ్రువపత్రాలైనా అందించాలని కోరుతున్నారు. కానీ పట్టించుకునేవారు కరువయ్యారు.

నాలుగు కేటగిరీలుగా..

లబ్ధిదారులను నాలుగు కేటగిరీలుగా విభజించారు. కేటగిరి ఏ కింద లబ్ధిదారుడు గృహనిర్మాణ సంస్థ నుంచి అప్పుగా తీసుకొని ఉండి మృతిచెందితే..వారి వారసులకు పట్టా అందిస్తారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇల్లు ఉంటే రూ.10 వేలు, మునిసిపాల్టీల్లో రూ.15 వేలు, కార్పొరేషన్‌లో రూ.20 చొప్పున వసూలు చేశారు. కేటగిరి బికి సంబంధించి రుణం తీసుకున్న వ్యక్తి నుంచి ఇతరులు ఆ ఇంటిని కొనుగోలుచేసినా క్రమబద్ధీకరించుకోవడానికి అవకాశమిచ్చారు. ఇందుకుగాను గ్రామీణ ప్రాంతాల్లో రూ.20 వేలు, మునిసిపాలిటీల్లో రూ.30 వేలు, కార్పొరేషన్ పరిధిలోరూ.40 వేలు వసూలు చేపట్టారు. కేటగిరికి సీకి సంబంధించి ప్రభుత్వ రుణం పొందకుండా.. సొంతంగా ఇంటిని నిర్మించుకున్నవారి నుంచి రూ.10 వేలు చొప్పున వసూలు చేశారు. కేటగిరీ డి కింద ప్రభుత్వం పట్టా ఇచ్చిన తరువాత.. దానిని అమ్ముకుంటే కొనుగోలు చేసిన వారు...గ్రామీణ ప్రాంతాల్లో రూ.10 వేలు, మునిసిపాల్టీల్లో రూ.15వేలు, కార్పొరేషన్‌లో రూ.20 వేల వంతున వసూలు చేశారు.

ఇదీ పరిస్థితి..

జిల్లా వ్యాప్తంగా అధికారులు, సచివాలయ సిబ్బంది బలవంతంగా వసూలు చేసినట్టు ఆరోపణలున్నాయి. 1983-2011 మధ్య 3,44,278 మంది లబ్ధిదారులు ఉన్నట్టు అప్పట్లో గుర్తించారు. ఇందులో గ్రామీణ ప్రాంతాలకు చెందిన వారు 3,13,714 మంది ఉండగా.. పట్టణ ప్రాంతాలకు చెందిన 30,564 మంది లబ్ధిదారులను గుర్తించగలిగారు. వీరి వద్ద నుంచి రూ.120 కోట్లు వసూలు చేయాలని నిర్ణయించుకున్నారు. అయితే ఒత్తిడి చేసి రూ.12 కోట్లు వసూలు చేసినట్టు గణాంకాలు చెబుతున్నాయి. జిల్లాల విభజన పుణ్యమా అని ఈ అంశం మరుగున పడిపోయింది. దీంతో లబ్ధిదారులకు ఎదురుచూపులు తప్పడం లేదు.

బలవంతంగా వసూలు

ఓటీఎస్ విషయంలో ఒక్క లబ్ధిదారులే కాదు.. అధికారులు, సచివాలయ సిబ్బంది అందరూ బాధ్యులే. ఇంతవరకూ లబ్ధిదారులకు సరైన డాక్యుమెంట్లు ఇవ్వలేదు. పేదల పింఛన్లు తొలగిస్తామని, సంక్షేమ పథకాలు నిలిపివేస్తామని అప్పట్లో బెదిరించారు. కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలతో ముడిపెట్టారు. రుణాలు తీసుకున్నవారు తప్పకుండా రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సిందేనని ఒత్తిడి పెంచారు. డ్వాక్రా గ్రూపుల్లో ఉన్నవారితో రుణాలు ఇప్పించి మరీ రిజిస్ట్రేషన్లు చేయించారు. వారికి ఇప్పటికీ డాక్యుమెంట్లు ఇవ్వలేదు. మరికొందరికి ఇచ్చినా అందులో వివరాలు తప్పుగా నమోదయ్యాయి. ఎన్నికలు సమీపిస్తుండడంతో అసలు డాక్యుమెంట్లు ఇస్తారా? రిజిస్ట్రేషన్ అయ్యిందా? లేదా? అని మాత్రం చెప్పలేకపోతున్నారు. దీనిపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.



ఇంటికి కొలతలు తీస్తున్న సిబ్బంది(ఫైల్)

17 నుంచి పోలిపల్లి పైడితల్లి జాతర

● మూడు రోజుల పాటు రాజాంలో కోలాహలం



రాజాం రూరల్, మార్చి 12: పోలిపల్లి పైడితల్లి అమ్మవారి 98వ వార్షిక జాతర మహోత్సవాలు ఈనెల 17 నుంచి మూడు రోజుల పాటు జరగనున్నాయి. ఉత్తరాంధ్ర జిల్లాలతో పాటు ఒడిశా నుంచి భక్తులు అధిక సంఖ్యలో వస్తారు. జాతర నిర్వహణకు దేవదాయశాఖ, ఎస్వీఆర్ కళాపరిషత్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు జరుగుతున్నాయి.

● అమ్మవారు రాజాంలో కొలువుదీరడం, ఆలయ నిర్మాణానికి సంబంధించి పలు కథలు ప్రచారంలో ఉన్నా.. 1926లో రాజాంకు చెందిన వాకచర్ల మల్లయ్య మరికొందరి సహాయంతో ఆలయ నిర్మాణానికి శ్రీకారం చుట్టి ఏడాదిలో పూర్తి చేశారని చెబుతున్నారు. నాటి నుంచి నేటి వరకూ వాకచర్ల కుటుంబీకులు వంశపారంపర్య ధర్మకర్తలుగా, కొండంపేట గ్రామానికి చెందిన లంకలపల్లి కుటుంబీకులు ఘటాల పూజారులుగా కొనసాగుతున్నారు. అమ్మవారి జాతర ఏటా పాల్గుణ మాసం శుక్ల పక్షం, పౌర్ణమి ముందు వచ్చే ఆది, సోమ, మంగళవారాల్లో నిర్వహించడం ఆనవాయితీ.

● అమ్మవారికి నేత్రోత్సవాన్ని ఈనెల 15న శుక్రవారం చేపట్టాలని నిర్ణయించారు. ఆలయ వంశపారంపర్య ధర్మకర్తలు పసుపు కుంకుమలు, పట్టువస్త్రాలు సమర్పిస్తారు. అమ్మవారి సన్నిధితో పాటు ఆలయానికి ఎదురుగా ఉన్న వనంగుడి వద్ద కూడా ప్రత్యేకంగా పూజలు నిర్వహిస్తారు. అనంతరం అమ్మవారి బుగ్గపై వాకచర్ల కుటుంబీకులు నల్లని చుక్క పెడతారు. ఈ కార్యక్రమాన్నే నేత్రోత్సవం అంటారు. 19న అమ్మవారి ఘటోత్సవం నిర్వహిస్తారు. దీంతో జాతర ముగిసినట్లవుతుంది.



కానరాని మామిడికాయలు

మామిడీలా

● జిల్లాలో దెబ్బతిన్న మామిడి పంట ● మంచు ప్రభావంతోనేనా?
● ఎకరాకు రూ.20 వేల వరకూ పెట్టుబడి ● దిగుబడిపై టెన్షన్ పడుతున్న రైతులు

గంట్యాడ, మార్చి 12:

మామిడి పంట ఆశాజనకంగా ఉంటుందని భావించి ఈ ఏడాది తోటలకు మూడు నుంచి నాలుగు సార్లు పురుగు మందులు పిచికారీ చేశాం. రెండుసార్లు భూమిని దున్నించాం. మొదట్లో పూత బాగా వచ్చింది. దీనిని చూసి సంతోషపడ్డాం. జనవరి, ఫిబ్రవరి నెలల్లో కురిసిన పొగమంచుకు మామిడి పూత దెబ్బతింది. అప్పటి నుంచి ఒక్క పిందె కూడా రాలేదు. ఎరువులు, ఇతర ఖర్చులు కలిపి ఎకరా వద్ద సుమారు రూ.20 వేలు పెట్టుబడితో 20 ఎకరాల్లో ఖర్చు చేశాం. పంట కనిపించడం లేదు. ప్రభుత్వం స్పందించి ఆదుకుంటే తప్పా వేరే మార్గం లేదు.

- గంట్యాడకు చెందిన ఓ మామిడి రైతు ఆవేదన

జిల్లాలో మామిడి పంట ఈ ఏడాది దారుణంగా దెబ్బతినే పరిస్థితి కనిపిస్తోంది. ఏ ప్రాంతంలో చూసినా మామిడి పింజి కన్పించడం లేదు. గతంలో కురిసిన మంచు ప్రభావం వల్ల మామిడి పంటకు తీవ్ర నష్టం వచ్చినట్లు రైతులు గగ్గోలు పెడుతున్నారు. ఇదివరకెప్పుడూ లేని విధంగా ఈసారి మామిడి పంట పోతుందేమోనని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా 29,952 హెక్టార్లలో మామిడి... 5,548 హెక్టార్లలో జీడి పంట సాగులో ఉన్నాయి. మామిడి పూత రాక ముందు రెండు సార్లు పురుగు మందు పిచికారీ చేయడంతో పాటు తోటను కూడా దున్నాలి. అలాగే పూత వచ్చిన తరువాత మరో రెండు సార్లు పురుగు మందు పిచికారీ చేయాలి. ఇలా ఎకరాకు రూ.20 వేల వరకూ రైతులు ఖర్చు చేశారు. మామిడి పింది వచ్చే సమయంలో జనవరి, ఫిబ్రవరి నెలలో కురిసిన పొగమంచు కారణంగా పూత దెబ్బతింది. రైతులు పెట్టిన పెట్టుబడి అంతా బూడిదలో పోసిన పన్నీరుగా మారుతోందన్న బాధ వారిలో ఉంది. జిల్లాలో ఒకటి..రెండు చోట్ల కాదు అన్ని ప్రాంతాల్లో ఇదే పరిస్థితి ఉంది. గంట్యాడ, బొండపల్లి, గజపతినగరం, దత్తిరాజేరు, ఎస్.కోట, చీపురుపల్లి, పూసపాటిరేగ, భోగాపురం, నెల్లిమర్ల, గుర్ల, వేపాడ మండలాల్లో ఎక్కువగా మామిడి సాగు చేస్తున్నారు. నాలుగు సంవత్సరాల నుంచి మామి డి పంట పెద్దగా కలిసిరావడం లేదని రైతులు నిరాశ చెందుతున్నారు. ఈ ఏడాది కూడా అలాగే ఉంటే కష్టమేనంటున్నారు.

ఆలోచించి ఓటేయాలి

● టీడీపీ సీనియర్ నేత అశోక్ గజపతిరాజు

విజయనగరం రింగురోడ్డు, మార్చి 12: రానున్న ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ఆలోచనతో ఓటేయాలని, అప్పుడే అందరూ బాగుపడతామని, అలా కాకుండా ప్రలోభాలకు లొంగి ఓటేస్తే అందరూ బాధపడాల్సి వస్తుందని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు అశోక్ గజపతిరాజు అన్నారు. చాంబర్ ఆఫ్ కామర్స్ భవనంలో రోటరీ క్లబ్స్, చాంబర్ ఆఫ్ కామర్స్ సంయుక్తంగా మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ విజ్ఞతతో ఉండాలని, అది లోపిస్తే, భవిష్యత్తు ఉండదన్నారు. విజయనగరం అభివృద్ధి గురించి అందరూ ఆలోచన చేయాలన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి దగ్గర నుంచి స్థానిక నాయకుల వరకూ విధ్వంసమే లక్ష్యంగా పాలన సాగిస్తున్నారని విమర్శించారు. రామతీర్థంలో విగ్రహం ధ్వంసం చేసిన వారిని ఇప్పటి వరకూ పట్టుకోలేదని, భక్తుల మనోభావాలు దెబ్బతీసేలా పాలకులు వ్యవహరిస్తున్నారని విమర్శించారు. పార్టీని చూడకుండా, తనను చూసి ఓటేయమని ఎమ్మెల్యే కోలగట్ల కోరడం హాస్యాస్పదమన్నారు. కార్యక్రమంలో టీడీపీ-జనసేన-బీజేపీ ఉమ్మడి అభ్యర్థి అదితి గజపతిరాజు, రోటరీ, చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు కాపుగంటి ప్రకాష్, రవ్వా శ్రీనివాస్, డాక్టరు కృష్ణశాంతి, రాజేష్, అరుణ్ సుధాని, నీతా విజ్వని తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అశోక్‌గజపతిరాజు

జగన్ రాష్ట్ర ప్రజలను వంచించారు: కోండ్రు


పార్టీలో చేరిన వారితో కోండ్రు

రాజాం: వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రాష్ట్ర ప్రజలను సీఎం జగన్ నయవంచనకు గురిచేశారని, నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి కోండ్రు మురళీమోహన్ అన్నారు. మంగళవారం మండలం దోసరి గ్రామానికి చెందిన 25 వైసీపీ కుటుంబాలు శ్యాంపురం క్యాంపు కార్యాలయంలో టీడీపీలో చేరాయి. వారికి పార్టీ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం కోండ్రు మాట్లాడుతూ వైసీపీకి చెందిన వారు భారీగా టీడీపీలో చేరడం శుభపరిణామం అన్నారు. గురవాన నారాయణరావు. దుప్పపూడి శ్రీనివాసరావు. కరణం శివవశంకరరావు, వైసీపీ పార్టీకి చెందిన వారు కరణం లక్ష్మణ రావు తదితరులు ఉన్నారు. ● పురపాలక సంఘ పరిధిలోని 7వ వార్డు శ్రీనివాసకాలనీ, కూరాకవీధి, ఆదినారాయణకాలనీ, గణేస్‌నగర్, కొండంపేట, సారధి రోడ్డులో మంగళవారం నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి కోండ్రు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వివిధ వ్యాపార వర్గాలను కలిసి టీడీపీకి ఓటు వేసి వచ్చే ఎన్నికల్లో గెలిపించాలని కోరారు. ప్రజలు కోండ్రుకు మంగళ హారతులు ఇచ్చి పూల వర్షం కురిపించారు. పార్టీ నాయకులు నంది సూర్యప్రకాష్‌రావు, గురవాన నారాయణరావు, దుప్పలపూడి శ్రీనివాసరావు, టంకాల కన్నంనాయుడు, కోండ్రు జగదీష్, గుడివాడ ఉత్తరకుమార్, తదితరులు పాల్గొన్నారు.

పైడిమాంబకు ప్రత్యేక పూజలు

విజయనగరం రూరల్: ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్య దైవం, కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి పైడిమాంబ ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. నగరంలోని వివిధ ప్రాంతాల భక్తులు అధిక సంఖ్యలో పైడిమాంబను దర్శించుకున్నారు. వివిధ రకాల పువ్వులతో అమ్మవారిని అలంకరించారు. బూరెలను నైవేద్యంగా సమర్పించారు.


పైడిమాంబకు బూరెల నైవేద్యం

2029లో కాంగ్రెస్‌దే అధికారం

జామి: షర్మిల నాయకత్వంలోని కాంగ్రెస్ పార్టీ 2029 సార్వత్రిక ఎన్నికల్లో అధికారం చేపట్టబోతోందని మండలపార్టీ అధ్యక్షుడు బోని అప్పారావు అన్నారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. రాజశేఖర్‌రెడ్డి సిద్ధాంతాలను అమలుచేసేది కాంగ్రెస్ అన్న విషయం రాష్ట్ర ప్రజలందరికీ తెలుసున్నారు. జామి ఎల్లారమ్మ జాతరను అన్ని వర్గాలనూ కలుపుకుని దేవదాయశాఖ విజయవంతం చేయాలని కోరారు.

పుణ్యగిరి హుండీ ఆదాయం రూ.5,56,395

శృంగవరపుకోట: పుణ్యగిరి మహా శివరాత్రి జాతర హుండీ ఆదాయం 5,56,395 వచ్చినట్లు ఆలయ కార్యనిర్వాహక కార్యదర్శి నాగేంద్ర తెలిపారు. దేవాదాయ శాఖ సహాయ కమిషనర్, శ్రీపైడితల్లమ్మ ఆలయ కార్యనిర్వాహక కార్యదర్శి డీవీవీ ప్రసాద్, పాలక మండలి చైర్మన్ పోలమరశెట్టి రామకృష్ణ సమక్షంలో మంగళవారం హుండీ లెక్కించామని చెప్పారు.

నేడు జనసేన ఆత్మీయ సమావేశం

రాజాం రూరల్: పట్టణంలోని సూర్యదుర్గ కల్యాణ మండపంలో బుధవారం జనసేన ఆత్మీయ సమావేశం నిర్వహించనున్నట్లు ఆ పార్టీ ప్రచార కమిటీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పొగిరి సురేష్ బాబు తెలిపారు. సాయంత్రం ఆరు గంటలకు నిర్వహించనున్న సమావేశంలో తెలుగుదేశం పార్టీ రాజాం నియోజకవర్గ అభ్యర్థి కోండ్రు మురళీమోహన్ పాల్గొంటారని ఆయన తెలిపారు. నియోజకవర్గ పరిధిలోని జనసేన నాయకులు, కార్యకర్తలు, పార్టీ అభిమానులు సమావేశానికి హాజరు కావాలని కోరారు.

రామ్‌కుమార్ శర్మకు సత్కారం

విజయనగరం రింగురోడ్డు: జిల్లా బ్రాహ్మణ అర్చక పురోహిత సంఘం ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా బ్రాహ్మణ అర్చక పురోహిత సంఘ అధ్యక్షులు బమ్మిడిపాటి రామ్‌కుమార్ శర్మను సత్కరించారు. 'జ్యోతిష శిరోమణి' అవార్డు అందుకున్న సందర్భంగా పంచముఖ ఆంజనేయ స్వామి ఆలయంలో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా బ్రాహ్మణ సేవా సంఘాల సమాఖ్య అధ్యక్షుడు శ్రీనివాస్, సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు.

16న జాతీయ లోక్‌అదాలత్

రాజాం రూరల్: కోర్టు ప్రాంగణంలో ఈనెల 16న జాతీయ లోక్‌అదాలత్ నిర్వహించనున్నట్లు మండల న్యాయ సేవా సంఘ అధ్యక్షులు, సీనియర్ సివిల్ జడ్జి ఎం.బాబు తెలిపారు. ఈ అవకాశాన్ని కక్షిదారులు వినియోగించుకోవాలని సూచించారు.

నేటి నుంచి క్రాష్ ప్రోగ్రాం

బాడంగి: రానున్న వేసవి దృష్ట్యా మండలంలోని 429 బోర్లలో ఎక్కడైనా మరమ్మతులకు గురైతే యుద్ధ ప్రాతిపదికన అక్కడికక్కడే బోర్లను రిపేరు చేస్తామని ఎంపీడీవో ఆంజనేయులు అన్నారు. క్రాష్ ప్రోగ్రాంలో భాగంగా ఈ నెల 13నుంచి వచ్చే నెల 25 వరకు గ్రామాల్లో బోరు మెకానిక్‌లు తిరిగి పాడైన బోర్లకు మరమ్మతులు చేసి ఆయా గ్రామాల్లో ఉన్న ప్రజ లకు తాగునీరు అందించే కార్యక్రమం చేపడుతున్నారని, పంచాయతీల పరిధిలో ఉన్న సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కార్యదర్శులు బోర్లు ఎక్కడెక్కడ మరమ్మతులకు గురయ్యాయో ముందుగా సమాచారం అందజేసి బోర్లకు మరమ్మతులు చేపడతామన్నారు. ● రేగిడి: మండలంలో వివిధ గ్రామాల్లో పాడైన బోర్లు బాగుచేసేందుకు మంగళవారం మండల కేంద్రంలో క్రాస్ ప్రోగ్రాం కింద ప్రత్యేక వాహనాన్ని ప్రారంభించారు. వైస్ ఎంపీపీ జగన్మోహనరావు ఈ వాహనాన్ని ప్రారంభించి మాట్లాడారు. ప్రజలు ఈప్రోగ్రాంను విని యోగించుకోవాలని కోరారు. మండల పరిషత్ ఏవో నాగ మణి, పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు ఉన్నారు.

దిబ్బగుడ్డివలసలో వైద్య శిబిరం

బొబ్బిలి: మండలంలోని దిబ్బగుడ్డివలస సచివాలయం పరిధిలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని నిర్వహించారు. ఎంపీడీవో రవికుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వైద్యులు పాల్గొని రోగులకు తనిఖీలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. పంచాయతీ కార్య దర్శి ఉడమల వెంకటనాయుడు, ఇతర ప్రజాప్రతి నిధులు పాల్గొన్నారు.

గోపాలపురంలో కమిషనర్ పర్యటన

రాజాం: పురపాలక సంఘం కమిషనర్ నారా అప్పలనాయుడు మంగళవారం గిరిజన గ్రామం గోపాలపురంలో పర్యటించారు. గ్రామంలో కాలువలు సీసీ రోడ్లను పరిశీలించారు. రక్షిత మంచినీటి పథకం వద్ద ఉన్న పిచ్చి మొక్కలను తొలగించాలని ఏఈకి ఆదేశించారు. సీసీ రోడ్లపై మురుగునీరు ప్రవహించకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

జగన్ బీసీ ద్రోహిగా మిగిలిపోతారు

ఎస్‌కోట టీడీపీ ఇన్‌చార్జి కోళ్ల లలితకుమారి

శృంగవరపుకోట రూరల్: రాష్ట్రంలో బీసీలను అన్నివిధాలుగా అణగదొక్కిన ముఖ్యమంత్రిగా జగన్‌రెడ్డి చరిత్రలో నిలిచిపోతారని మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి అన్నారు. మంగళవారం పోతనాపల్లి గ్రామంలో టీడీపీ నేత కూనిరెడ్డి రాముడు ఆధ్వర్యంలో జయహో బీసీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ధర్మవరం, సంతగైరమ్మపేట, వినాయకపల్లి, పోతనాపల్లి ముఖ్యనేతలతో ఆమె మాట్లాడారు. తెలుగుదేశం ప్రభుత్వం అన్ని బీసీ కులాల వారి ఆర్థిక అభివృద్ధికి పథకాలు అమలు చేసిందన్నారు. జగన్ అధికారంలోకి వచ్చాక వాటిని రద్దు చేసి.. ఆ కుటుంబాలకు తీరని నష్టం కలిగించారన్నారు. ఈ ప్రభుత్వాన్ని ఇంటికి పంపించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని అన్నారు. రానున్న తెలుగుదేశం ప్రభుత్వంలో చంద్రబాబు బీసీలకు పెద్ద పీట వేస్తామని తెలిపారు. కార్యక్రమంలో జీఎస్ నాయుడు, రెడ్డి వెంకన్న, చెక్కా కిరణ్, లగడు తిరుపతి తదితరులు పాల్గొన్నారు. ● లక్కవరపుకోట: జగన్ అబద్ధాలకోరని.. మరోమారు తన అబద్ధాలతో ప్రజలను మోసం చేయడానికి సిద్ధం సభలు పెట్టి ఊకదంపుడు ఉపన్యాసం ఇస్తున్నారని ఎస్.కోట టీడీపీ ఇన్‌చార్జ్ కోళ్ల లలితకుమారి విమర్శించారు.


మాట్లాడుతున్న లలితకుమారి

మంగళవారం టీడీపీ నేతలతో కలిసి విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. నాసిరకం సారాతో లక్షల కోట్ల వ్యాపారం చేశాడని ఆరోపించారు. పెట్రోలు, డీజిల్, గ్యాస్, కరెంటు బిల్లులు పెంచి పేదల నడ్డి విరిచాడని మండిపడ్డారు. ఇసుక ఫ్రీగా ఇస్తానని చెప్పి అందనంత ఎత్తుకు ధరలు పెంచాడని దుయ్యబట్టారు. కూటమితో ఓటమి తప్పదని గ్రహించిన జగన్ మతిభ్రమించి పిచ్చి హామీలు ఇస్తున్నాడని విమర్శించారు. టీడీపీ నేతలు సాగర్ కల్యాణ్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

హాస్టల్ విద్యార్థులంటే అంత అలుసా?

● వసతులు లేని ఇంటిలో విద్యార్థుల అవస్థలపై బేబీనాయన ఆగ్రహం

బొబ్బిలి, మార్చి 12: బొబ్బిలి మండలం పిరిడి గ్రామంలో బీసీ విద్యార్థుల వసతి గృహంలోని సమస్యలను స్వయంగా పరిశీలించిన టీడీపీ-జనసేన ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి బేబీనాయన ఆశ్చర్యం వ్యక్తం చేశారు. బేబీనాయన మంగళవారం పిరిడి గ్రామానికి వెళ్లి హాస్టల్‌ను సందర్శించారు. 52 మంది బీసీ విద్యార్థులను ఖాళీ చేయించి ఆ భవనాన్ని రైతుభరోసా కేంద్రానికి అప్పగించినట్లు విద్యార్థులంతా ఆయనకు తెలిపారు. ప్రస్తుతం ఓ చిన్న పెంకుటింటిలో ఎటువంటి సౌకర్యాలు లేని వాతావరణంలో దుర్భరంగా గడుపుతున్నామని విద్యార్థులు ఆయన దృష్టికి తెచ్చారు. తాగునీరు, స్నానపు గది లేక నానా అవస్థలు పడుతున్నామనివాపోయారు. ఇంటి యజమాని అనుమతితో అదనంగా స్నానపు గదిని, తాగునీటి సదుపాయాన్ని కల్పిస్తానని బేబీనాయన విద్యార్థులకు హామీ ఇచ్చారు. తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోనికి రాగానే సకల సౌకర్యాలతో విద్యార్థులకు వసతిగృహాన్ని ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం ఆయన గ్రామపెద్దలతో సమావేశమై పార్టీ వ్యవహారాలపై చర్చించారు. ఆయన వెంట పిరిడి గ్రామ పెద్దలు జాగాన రామకృష్ణరంగారావు, గర్భాపు పరశురామ్, గుంట తాతబాబు తదితరులు పాల్గొన్నారు.


పిరిడిలో హాస్టల్ విద్యార్థులతో మాట్లాడుతున్న బేబీనాయన

మహిళాభ్యున్నతికి టీడీపీ కృషి

విజయనగరం రూరల్: మహిళా అభ్యున్నతికి టీడీపీ ఎంతో కృషి చేసిందని విజయనగరం మున్సిపాలిటీ మాజీ చైర్‌పర్సన్ ప్రసాదుల కనకమహాలక్ష్మి చెప్పారు. టీడీపీ రాష్ట్ర శాఖ ఆదేశాల మేరకు నగరంలోని 7, 8 డివిజన్ల డ్వాక్రా సంఘాలతో దాసన్నపేటలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డ్వాక్రా సంఘాలు ఏర్పాటు చేయాలన్న టీడీపీ నిర్ణయం చరిత్రాత్మకమైన్నారు. డ్వాక్రా సంఘాలకు ఆర్థిక చేయూత, వ్యాపార అవకాశాలు, మార్కెటింగ్ వంటి సౌకర్యాలు కల్పించిన ఘనత టీడీపీ కే దక్కుతుందన్నారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ-బీజేపీ-జనసేన ఉమ్మడి అభ్యర్థి అదితి గజపతిరాజుని సైకిల్ గుర్తుపై ఓటేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలరు రౌతు పద్మ, టీడీపీ మహిళా విభాగం నాయకులు అనురాధ బేగం, పత్తిగిల్లి సూర్యకుమారి, మురిపేన పద్మలత, వీరలక్ష్మి, ఝాన్సీ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ప్రసాదుల కనకమహాలక్ష్మి

రాష్ట్రాభివృద్ధి కోసం టీడీపీకి ఓటేయండి

● అదితి గజపతిరాజు

విజయనగరం రూరల్, మార్చి 12: రాష్ట్రాభివృద్ధి కోసం రానున్న ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీకి ఓటేసి గెలిపించాలని టీడీపీ-జనసేన-బీజేపీ ఉమ్మడి అభ్యర్థి అదితి గజపతి రాజు వాకర్స్ క్లబ్ సభ్యులకు పిలుపునిచ్చారు. మంగళవారం కంటోన్మెంట్‌లోని తోష్నీవాల్ వాకర్స్ క్లబ్ సభ్యులను కలిశారు. ఈ సందర్భంగా వారందరితో మాట్లాడారు. వారందరినీ పరిచయం చేసుకుని, వాకర్స్ క్లబ్ సేవలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె వాకర్స్‌ని ఉద్దేశించి మాట్లాడారు. తన గెలుపునకు సహకరించాలని కోరారు. తోష్నీవాల్ వాకర్స్ క్లబ్ ప్రతినిధులతో పాటు, టీడీపీ నగర అధ్యక్షుడు ప్రసాదుల ప్రసాద్, టీడీపీ మహిళా విభాగం అధ్యక్షురాలు కొర్నాన రాజ్యలక్ష్మి, టీడీపీ నాయకుడు నమ్మి చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.


వాకర్స్ సభ్యులతో మాట్లాడుతున్న అదితి

టెన్త్ విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ

శృంగవరపుకోట: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పదో తరగతి విద్యార్థులు గణితంలో నూటికి నూరు శాతం మార్కులు సాధిస్తే.. తమకు నచ్చిన కార్పొరేట్ కళాశాలలో చదువుకునేందుకు 50 శాతం ఫీజును భరించనున్నట్లు టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గొంప కృష్ణ తెలిపారు. మంగళవారం స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు ప్యాడ్లు, పెన్నులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో మొదటి, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన విద్యార్థులకు కార్పొరేట్ కళాశాలల్లో 50 శాతం ఫీజు చెల్లిస్తానని మాట ఇచ్చారు. ప్రభుత్వ పాఠశాలల్లోని పేద, మధ్య తరగతి కుటుంబాల విద్యార్థులకు ఆర్థికంగా సహాయ పడేందుకు గొంప కృష్ణ విద్యాసంకల్పం ప్రారంభించానన్నారు. ఎస్.కోట, వేపాడ, కొత్తవలస, జామి, ఎల్.కోట మండలాల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 361 మంది విద్యార్థులకు పదో తరగతి పరీక్షల సామగ్రి అందించామని చెప్పారు. ఈ కార్యక్రమంలో విశాఖ పార్లమెంటు టీడీపీ ఉపాధ్యక్షుడు రాయవరపు చంద్రశేఖర్, మండల పార్టీ కార్యదర్శి జుత్తాడ రామసత్యం, అదారి రమేష్ తదితరులు పాల్గొన్నారు.


పదోతరగతి విద్యార్థులకు పరీక్ష సామగ్రి అందిస్తున్న గొంప కృష్ణ

అల్లుడు.. మామల అక్రమార్జనకు రెండు కౌంటర్లు

● కోలగట్ల పాలనలో నగరంలో అశాంతి
● వైసీపీ నేత కాళ్ల గౌరీశంకర్


మాట్లాడుతున్న కాళ్ల గౌరీశంకర్

విజయనగరం (ఆంధ్రజ్యోతి): కబ్జాలు, కమీషన్లతో అక్రమార్జనకు మామ కోలగట్ల, అల్లుడు కౌశిక్ కౌంటర్లు తెరిచారని... భూమి పాస్‌బుక్ నుంచి కుళాయి కనెక్షన్ వరకూ తన వద్దకే రావాలంటూ కార్పొరేటర్లును డమ్మీచేసిన ఘనత కోలగట్ల వీరభద్రస్వామిదేనని విజయనగరం కో-అపరేటివ్, అర్బన్ చైర్మన్, ఉడా మాజీ డైరెక్టర్, వైసీపీ నాయకులు కాళ్ల గౌరీశంకర్ ఆరోపించారు. నగరంలోని తన నివాసంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కోలగట్లపై ఆయన విరుచుకుపడ్డారు. కోలగట్ల వీరభద్ర స్వామి ఎన్నికైన తరువాత నగరంలో అశాంతి నెలకొందని... కత్తులు స్వైరవిహారం చేస్తున్నాయని అన్నారు. 2020 నగరపాలక సంస్థ ఎన్నికల సమయంలో ఓ బీజేపీ కార్యకర్తపై కత్తులతో దాడి చేసి చంపాలని చూసింది ఎవరో నగర ప్రజలకు తెలుసన్నారు. కోలగట్ల నియంతృత్వ ధోరణితో అనేక మంది వైసీపీని వీడుతున్నారన్నారు. నగరం చుట్టపక్కల భూకబ్జాలు పెరిగిపోయాయని, నగర పాలక సంస్థ, రెవెన్యూ వ్యవస్థను కూడా స్వామి కబ్జాచేసి ప్రభుత్వ శాఖలను తన ఆధీనంలో ఉంచుకున్నారని ఆరోపించారు. కార్పొరేటర్ల వ్యవస్థ పూర్తిగా నిర్వీర్యమైందని... వారి హక్కులను ఎ మ్మెల్యే కబ్జా చేశారని ఆరోపించారు. రానున్న ఎన్నికల్లో అదితి గజపతిరాజు విజయమే లక్ష్యంగా పనిచేస్తానని, కోలగట్ల ఓటమికి కంకణం కట్టుకుంటామని గౌరీశంకర్ అన్నారు. కోలగట్ల ఎమ్మెల్యే అయిన తరువాత ఆయన చేసిన అక్రమాలను త్వరలో బయట పెడతానని చెప్పారు. నగరంలో శాంతిభద్రతలు ఉండాలంటే.. టీడీపీని గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో మాజీ కౌన్సిలర్ గాడు అప్పారావు, హంస శ్రీను తదితరులు పాల్గొన్నారు.

స్వయం ఉపాధితో యువత తమకాళ్లపై నిలబడాలి

రేగిడి, మార్చి 12: యువతీ యువకులు స్వయం ఉపాధితో తమ కాళ్లపై తాము నిలబడాలని, ఇందుకు టెక్నికల్ స్కిల్స్ పెంపొందించుకోవాలని స్కిల్ డెవలప్‌మెంట్ జిల్లా అధికారి గోవిందరావు, రేగిడి ఎస్ఐ శ్రీనివాస్ పేర్కొన్నారు. మండలంలో ఉంగరాడమెట్ట వద్ద మంగళవారం టూ వీలర్ నిర్వహణపై జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ సంస్థ ఆధ్వర్యంలో 35 మంది నిరుద్యోగయువతకు నెల రోజుల శిక్షణ కార్యక్రమం ప్రారంభించారు. ఈ శిక్షణను బొత్స గురివి నాయుడు మెమోరియల్ ఎడ్యుకేషన్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. యువత టెక్నికల్ స్కిల్స్ పెంపొందించుకోవాలని, ఇందుకు జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ సంస్థ తోడ్పాటునందిస్తుందని, సబ్సిడీపై రుణసాయం అందించి వారి జీవితాలు తీర్చిదిద్దుతామని స్కిల్ డవలప్‌మెంట్ జిల్లా అధికారి తెలిపారు. మండల స్కిల్ డెవలప్‌మెంట్ కోఆర్డినేటర్ గణపతిరావు, సొసైటీ పీవో రవికిరణ్ పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి

53 మందికి ఇళ్లపట్టాలు పంపిణీ

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్


లబ్ధిదారులకు పట్టాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

రామభద్రపురం, మార్చి 12: మండల పరిధిలోని కొండకెంగువ గ్రామానికి చెందిన 53 మందికి ఇళ్లస్థల పట్టాలను మంగళవారం బొబ్బిలి ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు చేతులమీదుగా అందజేశారు. మంగళవారం 'ఇళ్ల పట్టాలు ఇచ్చేదెప్పుడు?' అనే శీర్షికన ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి స్పందించి తమకు పట్టాలు లభించాయని లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గత మూడేళ్లుగా పట్టాలు పంపిణీ చేయకుండా జాప్యం చేశారని, గ్రామాల్లో ఉన్న రాజకీయ కక్షల్లో భాగంగా ఇన్నాళ్లు జాప్యం జరిగిందని, అయితే ఆంధ్ర జ్యోతి కథనంతోనే మాకు న్యాయం జరిగిందని గ్రామానికి చెందిన పట్టా లబ్ధిదారుడు రౌతు మధు, మరికొంతమంది తెలిపారు. జడ్పీటీసీ అప్పికొండ సరస్వతి, వైస్ ఎంపీపీ బెవర ప్రసాద్, తహసీల్దార్ ఆకుల సులోచనారాణి, ఎంపీడీవో ఈశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

కిడ్నీ బాధితుడికి బ్యాటరీ సైకిల్ వితరణ

శృంగవరపుకోట రూరల్: ధర్మవరం గ్రామానికి చెందిన ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుడు పాలవలస గణేష్ మానవత్వం చాటుకున్నారు. స్థానిక ఎస్‌టీ కాలనీకి చెందిన గొర్లె నారాయణరావుకు రెండు కిడ్నీలు దెబ్బతిన్నాయి. అతని కుటుంబ పోషణ కష్టంగా ఉండడంతో పాటు నడిచేందుకు ఇబ్బంది పడుతున్నాడు. దీన్ని గుర్తించిన నారాయణరావు... బ్యాటరీ సైకిల్ ను గణేష్‌కు మంగళవారం అందించారు. మాజీ సర్పంచ్ గొర్లె దేముడు, గ్రామ యువత గణేష్ మాస్టారును అభినందించారు.


బ్యాటరీ సైకిల్ అందిస్తున్న గ్రామ పెద్దలు, గణేష్ మాస్టారు

కొలతలతో పనిచేస్తేనే వేతనం గిట్టుబాటు

రేగిడి: ఉపాధి వేతనదారులు రెండుపూటలా కొలతల మేరకు పనిచేయాలని, లేకపోతే రూ. 272లు వేతనం గిట్టుబాటు కాదని ఉపాధి ఏపీవో హరనాథ్ పేర్కొన్నారు. మండలంలో ఉంగరాడ పంచాయతీలో మంగళవారం వసంత చెరువుకు జరుగుతున్న ఉపాధి పనిని పర్యవేక్షించారు. టీఏ రాంబాబు, ఎఫ్ఏ రామకృష్ణ, మేట్లు పాల్గొన్నారు.

బాలికావలసలో వైద్యశిబిరం

రేగిడి: మండలంలో బాలికావలస గ్రామంలో మంగళవారం రాజాం లోని ఓ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించారు. రాగోలు జెమ్స్ వైద్యులు డా. మేఘనందన్ 100 మందికి తనిఖీలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీచేశారు.

సృష్టికి మూలం మహిళే

● జేఎన్‌టీయూలో ఘనంగా మహిళా దినోత్సవం

విజయనగరం రూరల్, మార్చి 12: జేఎన్‌టీయూ గురజాడ విశ్వవిద్యాలయంలో మంగళవారం మహిళా దినోత్సవాన్ని కళాశాల ఆవరణలో వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలు రంగాల్లో విజయం సాధించిన మహిళలను జేఎన్‌టీయూ ఘనంగా సన్మానించింది. ఈ కార్యక్రమాన్ని జేఎన్‌టీయూ వీసీ ప్రొఫెసర్ కె వెంకట సుబ్బయ్య జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటైన కార్యక్రమంలో ఆయన మహిళలను ఉద్దేశించి మాట్లాడారు. సృష్టికి మూలం మహిళేనని, గతంతో పోల్చితే మహిళలు అన్ని రంగాల్లో ముందుకు దూసుకుని వెళ్తున్నారన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన భీముని పట్టణం పాలిటెక్నిక్ కళాశాల ఈసీఈ డిపార్టుమెంట్ హెడ్ డాక్టరు పద్మావతి మాట్లాడుతూ మహిళలు సాధించలేనిదంటూ ఏమీ లేదన్నారు. మరో అతిథిగా హాజరైన డాక్టరు బీఆర్ అంబేద్కర్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ రజనీ మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో ముందంజలో ఉండాలన్నారు. ఇందుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో డాక్టరు పద్మలీల, జేఎన్‌టీయూ కళాశాల ప్రొఫెసర్ జి జయసుమ, డాక్టరు బి నళినిలను ఘనంగా సన్మానించారు.


పద్మావతిని సన్మానిస్తున్న జేఎన్‌టీయూ కళాశాల అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది

ఆటోను ఢీకొన్న లారీ.. ఒకరి మృతి


తమ్మినాయుడు (ఫైల్)

తెర్లాం, మార్చి 12: ఆటోను లారీ ఢీకొనడంతో వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. మండలంలోని పెరుమాలి సమీపంలో మంగళవారం జరిగిన ఈ ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రాజాం నుంచి బాడంగి వైపు ప్రయాణికులతో వెళుతున్న ఓ ఆటోను పెరుమాలి సమీపంలో రాజాం వైపు నుంచి వస్తున్న ఒక గుర్తు తెలియని లారీ వెనుకనుంచి వచ్చి బలంగా ఢీకొంది. దీంతో ఆటో బోల్తా పడి ఆటోలో ప్రయాణిస్తున్న చినపాలవలసకు చెందిన చల్లారపు తమ్మినాయుడు(45) అక్కడికక్కడే మృతి చెందాడు. ఆ సమయంలో ఆటోలో ఐదుగురు ప్రయాణిస్తుండగా మిగిలిన వారంతా స్వల్పంగా గాయపడ్డారు. మృతుడు తమ్మినాయుడు రోజువారీ వ్యవసాయ కూలీ అని, అతనికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారని ఎస్ఐ రమేష్ తెలిపారు. పెద్ద కుమార్తె సాయినిఖితకు వివాహం కాగా, రెండో కుమార్తె నీలిమ చదువుకుంటోందని ఆయన తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

ఇంటి నుంచి వెళ్లిపోయి.. వ్యక్తి మృతి

భోగాపురం: వ్యక్తి మృతి చెంది పడి ఉన్న ఘటన భోగాపురం పంచాయతీ అప్పన్నపేట గ్రామం గెడ్డ సమీపంలో చోటు చేసుకుంది. దీనికి సంబంధించి ఎస్ఐ పి.సూర్యకుమారి మంగళవారం తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలం రామచంద్రపేట గ్రామానికి చెందిన నొడగల అప్పన్న(48) కూలి పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. మద్యానికి బానిసైన అప్పన్న నిత్యం మద్యం తాగుతుండే వాడు. మద్యం తాగొద్దని కుటుంబసభ్యులు మందలించడంతో ఈనెల 4వ తేదీన ఇంటి నుంచి వెళ్లిపోయాడు. అయితే ఎంతకీ ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు తెలిసిన వారిని, బంధువుల దగ్గర ఆచూకీ కోసం ప్రయత్నించినా ఫలితం లేకుండా పోయింది. ఈ క్రమంలో సోమవారం రాత్రి అప్పన్నపేట గ్రామంలోని గెడ్డ సమీపంలో అప్పన్న శవమై ఉండడం స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. మద్యం మత్తులో చనిపోయి ఉంటాడని స్థానికులు భావిస్తున్నారు. మృతుడికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. దీనిపై మృతుడి కుమారుడు నొడగల రమణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ సూర్యకుమారి తెలిపారు.

ఎస్‌ఎమ్ఎస్ పరిశ్రమలో చోరీ

సుమారు రూ. 18లక్షల విలువ గల కేబుళ్లు మాయం

పూసపాటిరేగ: మండలంలో కందివలస పంచాయతీలో గల ఎస్ఎమ్ఎస్ పరిశ్రమలో సుమారు రూ. 18 లక్షల విలువగల కేబుళ్లు చోరీ జరిగింది. గత కొంతకాలంగా ఈకేబుళ్లు చోరీ అవుతుండటంతో పరిశ్రమ సెక్యూరిటీ ప్రత్యేక నిఘా పెట్టడంతో కేబుళ్లను దొంగతనంగా తరలిస్తున్న వాహనం సోమవారం పట్టుబడింది. కొందరు పరిశ్రమ గోడవద్ద ఒక వాహనాన్ని నిలిపి ఈ కేబుళ్లను వాహనంపై లోడుచేసి చోరీకి పాల్పడుతున్న సమయంలో సెక్యూరిటీ సిబ్బంది పట్టుకోవడంతో ఈ వాహనాన్ని దుండగులు అక్కడే వదిలి వెళ్లిపోయారు. ఇందులో తరలిస్తున్న కేబుళ్ల విలువ సుమారుగా 8లక్షల రూపాయల వరకూ ఉండవచ్చునని పరిశ్రమ వర్గాలు తెలిపాయి. దుండగులు పలుమార్లు సుమారుగా 18 లక్షల రూపాయల విలువగల ఈకేబుల్‌లు దొంగలించినట్లు పరిశ్రమ సిబ్బంది తెలిపారు. దీనిపై స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు తెలిపారు.


కేబుల్‌లు దొంగలిస్తుండగా పట్టుబడిన వాహనం

40 లీటర్ల సారా స్వాధీనం

బొబ్బిలి: మండలంలోని నిమ్మలపాడు గ్రామంలో మంగళవారం నిర్వహించిన దాడుల్లో 40 లీటర్ల సారా, వెయ్యి లీటర్ల ఎఫ్‌జే వాష్‌ను పట్టుకున్నామని సెబీ ఇన్‌స్పెక్టర్ బీవీ మురళీధర్ తెలిపారు. ఏఎస్పీ ఆదేశాల మేరకు నిర్వహించిన దాడుల్లో పట్టుబడ్డ బెల్లం ఊటను ధ్వంసం చేశామని, సారాను పట్టుకొని నిందితుల కోసం ఆరా తీస్తున్నామని ఆయన తెలిపారు. ఈ దాడుల్లో ఎస్ఐ ఎస్‌వీ రామారావు, సిబ్బంది పి.జయరామ్‌నాయుడు, బి.ఆదినారాయణ పాల్గొన్నారు.

వ్యాన్ బైక్ ఢీ.. ముగ్గురికి గాయాలు

రామభద్రపురం: మండలంలో జొన్నవలస రోడ్డు వద్ద సాలూరు నుంచి రామభద్రపురం వస్తున్న వ్యాన్ ఎదురుగా రామభద్రపురం నుంచి సాలూరు వైపు వస్తున్న బైక్‌ను ఢీకొనడంతో బైక్‌పై ఉన్న సాలూరుకు చెందిన రాకేష్, సూరజ్, రమేష్ తీవ్ర గాయాల పాలయ్యారని ఎస్ఐ జ్ఞానప్రసాద్ తెలిపారు. సూరజ్ పరిస్థితి ఆందోళనగా ఉండడంతో విజయనగరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారని, మిగిలిన ఇద్దరూ సాలూరు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని తెలిపారు.

జూదరుల అరెస్టు

బొబ్బిలి: మండలంలోని రాచ్చెరువలస గ్రామ సమీపంలో పేకాటాడుతుండగా ఆరుగురు వ్యక్తులు పట్టుబడ్డారని ఎస్ఐ చదలవాడ సత్యనారాయణ తెలిపారు. వారి నుంచి 40,030 రూపాయలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

దంపతుల ఆత్మహత్యా యత్నం

చీపురుపల్లి: పట్టణానికి చెందిన దంపతులు అప్పుల బాధ తాళ లేక ఆత్మహత్యకు ప్రయత్నించిన ఘటన పట్టణంలో మంగళవారం చోటు చేసుకుంది. మెయిన్ రోడ్డులో బ్రిడ్జికి సమీపంలో వీరు గొంతుకు స్వల్పంగా గాయం చేసు కొని ఆత్మహత్యకు పాల్పడ్డారు. స్థానికుల సమాచారంతో 108 సిబ్బంది వీరిని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ వీరికి పరీక్షలు నిర్వహించిన వైద్యులు ఎటువంటి ప్రమాదం లేదని తెలిపారు. బాధితులు, స్థానికుల కథనం ప్రకారం ఈ కుటుంబం గతంలో కిరాణా వ్యాపారం చేసేది. ఈ క్రమంలో రెండు కోట్ల వరకూ అప్పు చేశారు. ఆ తరువాత వ్యాపారం సక్రమంగా జరగక, అటు అప్పులు తీర్చే దారి లేక, వీరు వేరే గ్రామానికి మకాం మార్చారు. తమకు రావాల్సిన బకాయిల కోసం రుణదాతలు పదే పదే ఫోన్లు చేయడంతో, మనస్తాపం చెందిన వీరు మంగళవారం పట్టణానికి చేరుకొని, రాజాం రోడ్డులో బ్రిడ్జికి సమీపంలో గొంతుపై గాయం చేసుకొని ఆత్మహత్యకు ప్రయత్నించారు. కాగా, స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో వీరు ప్రస్తుతం చికిత్స పొందుతున్నారు.

వందేభారత్ రైలుకు స్వాగతం

విజయనగరం దాసన్నపేట: వందేభారత్ రైళ్లను మంగళవారం పర్చువల్ విధానంలో ప్రధాని నరేంద్రమోదీ జాతికి అంకితం చేసిన సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా విశాఖపట్టణం నుంచి పూరీ వెళ్లే వందేభారత్ రైలుకు బీజేపీ నేతలు ఘనంగా స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జాతీయ కౌన్సిల్ సభ్యుడు శివప్రసాద్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఉచిత సీటుకు దరఖాస్తులెలా?

● ప్రైవేటు పాఠశాలల్లో ప్రవేశానికి కష్టాలు
● ఆన్‌లైన్‌లో ఇబ్బందులు ● సమీపించిన గడువు

గంట్యాడ: మండలంలోని పెణసాం గ్రామానికి చెందిన ఎస్.పైడిరాజు తన కుమార్తెను ఒకటో తరతగతిలో చేర్పించడానికి ప్రభుత్వం జారీ చేసిన నోటిఫికేషన్ ప్రకారం ప్రైవేటు పాఠశాలల్లో ఉచిత సీటు కోసం దరఖాస్తు చేసుకోవడానికి నెట్ సెంటర్‌కు వెళ్లాడు. దగ్గరలోని ప్రైవేటు స్కూల్స్ కాకుండా 15 కిలోమీటర్ల దూరంలో ఉన్న పెదమజ్జిపాలెంలోని ఒక ప్రైవేటు పాఠశాలలో సీటు ఖాళీగా ఉన్నట్లు ఆన్‌లైన్‌లో చూపిస్తోంది. ఐదేళ్ల బాలిక అంతదూరం వెళ్లడం కష్టం. దీంతో నిరాశతో వెనుతిరిగాడు. ప్రైవేటు స్కూల్స్ మ్యాపింగ్ సక్రమంగా చేయకపోవడం వల్లే ఈ సమస్య వచ్చినట్లు తెలుస్తోంది. ఇదే సమస్యను జిల్లా అంతటా ఎదుర్కొంటున్నారు. గ్రామాలకు దగ్గరలోని ప్రైవేటు స్కూల్స్ మ్యాపింగ్ చేసినప్పుడు సరిగా జరగలేదు. అనేక లోపాలు ఉండటంతో చాలా మంది నిరుపేద కుటుంబాలకు చెందిన వారు ఈ పథకానికి దరఖాస్తు చేసుకోలేకపోతున్నారు. నిరుపేద, బలహీన, మైనార్టీ వర్గాల కుటుంబాలకు చెందిన పిల్లలకు ప్రభుత్వం ఉచిత సీట్లు కేటాయించింది. అర్హులైన విద్యార్థులు గత నెల 25 నుంచి దరఖాస్తు చేసుకోవాలని చెప్పింది. ఈనెల 14తోనే గడువు ముగియనుంది. మొదట్లో సర్వర్ ఓపెన్ కాకపోవ డంతో నిరాశ చెందిన తల్లిదండ్రులు ఇప్పుడు స్కూల్స్ మ్యాపింగ్‌లో లోపాలు ఉండటంతో మరింత ఇబ్బంది పడుతున్నారు. విద్యా హక్కు చట్టం కింద పేద పిల్లలు ప్రైవేటు స్కూళ్లలో ఉచితంగా విద్యనభ్యసించడానికి రెండు సంవత్సరాల కిందట ఈ పథకాన్ని ప్రభుత్వం ప్రవేశ పెట్టింది. ఆర్థికంగా వెను కబడిన విద్యార్థులకు ప్రైవేటు పాఠశాలలు, ఎయిడెడ్ పాఠశాలల్లో 25 శాతం సీట్లు కేటాయించారు. ఐదేళ్ల నుంచి ఆరేళ్ల వయసున్న పిల్లలకు ఒకటో తరగ తిలో ఉచిత ప్రవేశాల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానించారు. కాగా, విద్యార్థి స్వగ్రామానికి కిలో మీటర్లు, మూడు కిలో మీటర్లు, ఐదు కిలో మీటర్ల దూరంలో ఉన్న ప్రైవేటు స్కూల్స్ ఆన్‌లైన్‌లో ఓపెన్ కావాలి. అలా కాకుండా చాలా దూరప్రాంతాల్లో ఉన్న స్కూల్స్ ఓపెన్ కావడంతో విద్యార్థుల తల్లిదం డ్రులు పథకానికి దరఖాస్తు చేసుకోలేక నిరాశ చెందుతున్నారు. ఇదే విషయం రెండో ఎంఈవో శంకరరావు వద్ద ప్రస్తావించగా సమస్యను జిల్లా విద్యాశాఖ అధికారుల దృష్టికి తీసుకువెళ్తామని వెల్లడించారు.


ఓ ప్రైవేటు పాఠశాలలో బోధిస్తున్న ఉపాధ్యాయిని (ఫైల్)

నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకోండి

● కలెక్టర్ నాగలక్ష్మి
● గ్రామాల్లో అవగాహన సదస్సులు

భోగాపురం/ నెల్లిమర్ల: ఓటర్లంతా తమ ఓటు హక్కును నిర్భయంగా వినియోగిం చుకోవాలని కలెక్టర్ నాగలక్ష్మి అన్నారు. మండలంలోని ముంజేరు, నెల్లిమర్ల మండలంలోని మల్యాడ గ్రామాల్లో మంగళవారం ఓటర్లకు ఓటు హక్కు వినియోగంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో ఓటింగ్ శాతాన్ని పెంచేందుకు బూత్ స్థాయి అవగాహన గ్రూపులను ఏర్పాటు చేశామని చెప్పారు. ప్రతి పది పోలింగ్ కేంద్రాలకు ఒక సెక్టార్ అధికారిని, పోలీస్ శాఖ నుంచి మరో సెక్టార్ అధికారిని నియమించామన్నారు. ఓటర్లకు ఏదైనా ఇబ్బందులు ఎదురైతే ఫిర్యాదులు చేయాలని సూచించారు. పోలింగ్ కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్ ఏర్పాటు చేశామని చెప్పారు. పోలింగ్‌కేంద్రానికి రాలేని 85ఏళ్ల పైబడిన వారు, దివ్యాంగులు తమ ఇంటి వద్ద నుంచే ఓటుహక్కును వినియోగించు కునేలా తొలిసారిగా అవకా శాన్ని కల్పించామని తెలిపారు. దీనికి ముందుగా దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఈసందర్భంగా ఎస్పీ దీపికా పాటిల్ మాట్లాడుతూ ఎన్నికలు ప్రశాంతంగా, సజావుగా నిర్వహించేం దుకు అనువైన వాతావరణాన్ని కల్పిస్తున్నామని చెప్పారు. ఓటర్లకు ధైర్యాన్ని ఇచ్చే విధంగా అనేక గ్రామాల్లో పోలీసు కవాతు నిర్వహిస్తున్నామని తెలిపారు. గత ఎన్నికల్లో జరిగిన వివాదాలను దృష్టిలో ఉంచుకుని ముందస్తు చర్యల్లో భాగంగా బైండోవర్ కేసులు నమోదు చేశామని చెప్పారు. ● అనంతరం ముంజేరు గ్రామస్థులు మురుగు కాలువ సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా, ఎవరికీ ఇబ్బందులు కలగకుండా ఈ సమస్యను పరిష్కరిస్తామని, దీనిని గ్రామస్థులంతా సహకరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ ఐపీఎస్ అధికారి మండజావలి అల్ఫాన్స్, ఆర్డీవో ఎంవీ సూర్యకళ, డీఎస్పీ ఆర్.గోవిందరావు, సీఐలు రవికుమార్, వెంకటేశ్వరరావు, తహసీల్దార్లు శ్యామ్‌ప్రసాద్, ధర్మరాజు, ఎంపీడీవోలు జి.చంద్రకళ, రామారావు, ఎన్నికల డీటీ మూర్తి తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి

చట్ట సభల్లో యాదవులకు అవకాశం ఇవ్వాలి

● ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు సాయికిరణ్ యాదవ్


నాగార్జునకు వినతిపత్రం అందజేస్తున్న యాదవ సంఘాల ప్రతినిధులు

చీపురుపల్లి: జిల్లాలో రెండున్నర లక్షలకు పైగా ఓట్లు ఉన్న యాదవులకు అసెంబ్లీలో పోటీ చేసే అవకాశం ఇవ్వాలని యాదవ సంఘాల ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు సాయికిరణ్ యాదవ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన టీడీపీ జిల్లా అధ్యక్షుడు కిమిడి నాగార్జునను కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లా ఏర్పాటై 46 సంవత్సరాలు గడుస్తున్నా, ఇప్పటివరకూ ఏ రాజకీయ పార్టీ కూడా యాదవులకు టికెట్ ఇవ్వలేదన్నారు. జనాభా ప్రాతిపదికన కనీసం ఎంపీపీ, జడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్‌లుగా కూడా అవకాశం ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. విజయనగరం అసెంబ్లీ నియోజకవర్గంలో 55 వేల మంది యాదవ ఓటర్లు ఉన్నారని, విజయనగరం సీటును యాదవులకు కేటాయిస్తే భారీ మెజారిటీతో గెలిచే అవకాశం ఉందన్నారు. దీనికి స్పందించిన నాగార్జున యాదవ కులస్థుల ప్రతిపాదనను పార్టీ అధినేతకు వివరిస్తానని చెప్పారు. కిరణ్ యాదవ్ వెంట రాష్ట్ర ఉపాధ్యక్షుడు పడాల గణేష్ యాదవ్, తదితరులు ఉన్నారు.

ఎంపీ టికెట్‌ను కొప్పలవెలమలకు కేటాయించాలి


మాట్లాడుతున్న బీజేపీ నాయకుడు మరిశర్ల

బొబ్బిలి: బీజేపీ విజయ నగరం ఎంపీ స్థానాన్ని కొప్పల వెలమలకు కేటాయించాలని ఆ పార్టీ బొబ్బిలి నియోజకవర్గ ఇన్‌చార్జి మరిశర్ల రామారావు నాయుడు కోరారు. మంగళవారం సాయంత్రం స్థానిక బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. తెలుగుదేశం-బీజేపీ-జనసేన పొత్తు శుభ పరిణామమని అన్నారు. ఇదిలా ఉండగా.. మల్లమ్మపేట గ్రామానికి చెందిన వివిధ కుటుంబాల వారు బీజేపీలో చేరారు. వారందరికీ పార్టీ కండువాలు వేసి మరిశర్ల సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు పూడి జగదీశ్వరరావు, జాగారపు త్రినాథనాయుడు, మహిళా మోర్చా నాయకురాలు రెడ్డి స్రవంతి తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం


మాట్లాడుతున్న ఆర్డీవో సాయిశ్రీ

బొబ్బిలి: స్థానిక రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో మంగళవారం ఆర్డీవో ఎ.సాయిశ్రీ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. మోడల్ కోడ్‌పై వారికి అవగాహన కల్పించారు. ఈ వారంలో ఓటర్ల జాబితాలో సవరణల కోసం ఫారం-8 కింద 354 దరఖాస్తులు వచ్చాయని, ఫారం-6 కోసం 176, ఫారం-7 కోసం 44 దరఖా స్తులు వచ్చాయని ఆమె తెలిపారు. వాటిన్నిటిపై దర్యాప్తు నిర్వహించి సత్వరం చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఎన్నికల నోటిఫికేషన్ ముందు రోజు వరకూ దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. నామినేషన్ల ప్రక్రియ ముందురోజు వరకు ఓటర్ల జాబితాలో కొత్త ఓటర్ల పేర్లు చేర్పుల కోసం ఫారం-6 దరఖాస్తులను మాత్రమే స్వీకరిస్తామని స్పష్టం చేశారు. ఎన్నికల సంఘం నిర్దేశిం చిన నిబంధనల ప్రకారం ఎన్నికలను ప్రశాంతంగా, విజయవంతంగా నిర్వహిం చేందుకు రాజకీయ పార్టీలన్నీ అధికార యంత్రాంగానికి సహకరించాలని ఆర్డీవో కోరారు. సమావేశంలో తహసీల్దార్ వి.త్రినాథరావునాయుడు, డీటీ రెడ్డి సాయికృష్ణ, టీడీపీ, వైసీపీ, కాంగ్రెస్, సీపీఐ, లోక్‌సత్తా పార్టీల ప్రతినిధులు వాసిరెడ్డి సత్యనా రాయణ, పక్కి చంద్రమౌళి, ముప్పల శ్రీనివాసరావు, మునకాల శ్రీనివాసరావు, ఆకుల దామోదర రావు తదితరులు పాల్గొన్నారు.

ఇసుక వాహనాలను ఎలా విడిచిపెట్టారు?

కొమరాడ: ఇసుక అక్రమ రవాణా చేస్తున్న వాహనాలను సోమవారం సాయంత్రం పట్టుకుని తహసీల్దార్ కార్యాలయానికి అప్పగిస్తే ఎలా విడిచి పెట్టారని టీడీపీ మండల కన్వీనర్ ఉదయశేఖరపాత్రుడు.. తహసీల్దార్ రమేష్ కుమార్‌ను సమాచార హక్కు చట్టం ద్వారా అడిగారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఈమేరకు దరఖాస్తును అందించారు. ఇసుక రవాణాకు ఉపయోగిస్తున్న వే బిల్లులు ప్రభుత్వ అనుమతితో ఉన్నాయా.. ఉంటే ఇసుక రేవుకు సంబంధించిన అనుమతులు, వాటి పత్రాలను సమాచార హక్కు చట్టం ద్వారా అందివ్వాలని ఆయన కోరారు. అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడారు. అధికార పార్టీ నాయకుల ఒత్తిడి మేరకే అక్రమంగా ఇసుక తరలిపోతున్నా అధికార యంత్రాంగం చూసీ చూడనట్లు వ్యవహరిస్తోందని ఆయన ఆరోపించారు. ఒక వైపు మైన్స్ ఏడీ కూనేరు రామభద్రపురం వద్ద నాగావళి నదిలో ఇసుక తీసేందుకు ఎటువంటి అనుమతులు లేవని చెబుతున్నప్పటికీ అధికారుల కార్యాలయాల ముందు నుంచే ఇసుకతో ట్రాక్టర్లు, లారీలు వెళుతున్నా చూసీచూడనట్లు వ్యవహ రిస్తున్నారని విమర్శించారు. అనధికారికంగా వైసీపీ నాయకులు ఇసుకను దోచుకుంటున్నా అధికారులు చర్యలు చేపట్టకపోవడంపై పోరాటం చేస్తామని తెలిపారు.

వ్యర్థాల తొలగింపు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

గరుగుబిల్లి: మండల కేంద్రంలోని ప్రధాన రహదారికి ఆనుకుని చెరువు ప్రాంతంలో గరుగుబిల్లిలో సేకరిం చిన వ్యర్థాలను కుప్పలుగా వేయడంతో ఈ ప్రాంతమంతా దుర్గంధ భరితంగా తయారయ్యింది. రహదారులకు ఆనుకుని వివిధ ప్రభుత్వ కార్యాలయాలు ఉన్నాయి. నిత్యం ఈ ప్రాంతం ఒక వైపు పొగతో పాటు మరో వైపు దుర్గంధభరితంగా తయారయ్యింది. ఉద్యోగులు పడుతు న్న అవస్థలపై 'కార్యాలయాల ముందు వ్యర్థాలు' శీర్షికన ఈనెల 8న ఆంధ్రజ్యోతిలో కథనం వెలువడింది. ఈకథనంపై మండల విస్తరణాధికారి ఎల్.గోపాలరావు, కార్యదర్శి డి.జగదీశ్వరరావు స్పందించారు. వ్యర్థాలను వేరే ప్రాంతానికి తరలించే చర్యలు చేపడుతున్నారు. దీనిపై ఉద్యోగులు, ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

సాలూరు: పౌష్టికాహారంతోనే పిల్లలకు సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని సీడీపీవో సత్యవతి తెలిపారు. ఈసందర్భంగా పట్టణంలో మంగళవారం ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈనెల తొమ్మిదో తేదీ నుంచి 23 వరకు పౌష్టికాహార పక్షోత్సవం నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు, పలువురు అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

విజిలెన్స్ అధికారుల తనిఖీ

సాలూరు: పట్టణంలోని బంగారమ్మపేటలో ఉన్న పౌర సరఫరాల డిపో1లో మంగళవారం విజిలెన్స్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. విజిలెన్స్ సీఐ బి.సింహాచలం మాట్లాడుతూ సాధారణ తనిఖీల్లో భాగంగానే పరిశీలించామని తెలిపారు. చిన్న చిన్న లోపాలు మాత్రమే గుర్తించామని, వాటిని సీఎస్‌డీటీ రంగారావుకు తెలియజేశామన్నారు. ఆయన వెంట పలువురు అధికారులు ఉన్నారు.

పాలకుల నిర్లక్ష్యంతోనే గుమ్మిడిగెడ్డకు కష్టాలు

గుమ్మలక్ష్మీపురం/కురుపాం: వైసీపీ, టీడీపీల నిర్లక్ష్యం వల్లనే గుమ్మిడిగెడ్డ మినీ రిజర్వాయర్ పూర్తి కాలేదని సీపీఎం నాయకులు మండంగి రమణ ధ్వజమెత్తారు. మంగళవారం గుమ్మలక్ష్మీపురం మండలం బొడ్డగూడలో సీపీఎం నాయకులు విలేకరులతో మాట్లాడుతూ గుమ్మిడిగెడ్డ మినీ రిజర్వాయర్ నిర్మిస్తే కురుపాం, కొమరాడ, జియ్యమ్మవలస, గరుగుబిల్లి మండలాల్లో 10 వేల ఎకరాలకు సాగునీరు అందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఎం.తిరుపతిరావు, కోలక అవినాష్, కొల్లి గంగునాయుడు, ఎం.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

అక్షరాస్యతతోనే అభివృద్ధి

గరుగుబిల్లి: గ్రామ స్థాయిలో పూర్తి స్థాయి అక్షరాస్యత ఉన్నట్లయితే అభివృద్ధి సాధ్యమవుతుందని ఉల్లిభద్ర డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన కళాశాల అసోసియేట్ డీన్ డా.బి.ప్రసన్నకుమార్ అన్నారు. సంతోషపురం, సుంకి పంచాయతీల్లో మంగళవారం అక్షరాస్యతపై మహిళలకు అవగాహన కల్పించారు. మహిళలు అక్షరాస్యత సాధిస్తే కుటుంబానికి ఆసరాగా ఉంటారన్నారు. అనంతరం డిజిటల్ అక్షరాస్యత, సైబర్ సెక్యూరిటీ, నగదు రహిత భారతదేశంతో పాటు పలు అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు డా.బి.హరిరామినాయుడు, జి.నరసింహమూర్తి, ఎం.అనిత, దివ్య ప్రశాంతి పాల్గొన్నారు.

ఉపాధి పనులు కల్పించండి


సూర్యనారాయణకు సమస్యను వివరిస్తున్న ఉపాధి కూలీలు

భోగాపురం: ఆక్రమణలో ఉన్న స్థలాలను ప్రభుత్వం స్వాధీనం చేసుకుని అక్కడ ఉపాధి పనులు కల్పించాలని రామచంద్రపేట పంచాయతీ తోటపల్లికి చెందిన గ్రామస్థులు కోరారు. ఈ మేరకు మంగళవారం స్థానిక కార్యాలయ ఆవరణ లో వైసీపీ మండల అధ్యక్షుడు ఉప్పాడ సూర్యనారాయణరెడ్డి, ఉపాధి హామీ సిబ్బం ది దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లారు. ఈసందర్భంగా తోటపల్లికి చెందిన పతివాడ సూరీడు, పిట్టా యర్రయ్యమ్మ, నమ్మి చిట్టెమ్మ తదితరులు మాట్లాడారు. తమకు గత రెండు రోజులుగా ఉపాధి పనులు కల్పించలేదని, అడిగితే ఎక్కడా చెరువులు లేవని సమాధానం ఇస్తున్నారని చెప్పారు. తోటపల్లి సమీపం కొంగవానిపాలెం రెవెన్యూ పరిధిలో సీతమ్మ చెరువు సమీపంలో సర్వే నెంబరు 147లో 11నుంచి 16 వరకు సబ్ డివిజన్‌లలో సుమారు ఎకరా 16 సెంట్ల ప్రభుత్వ స్థలం ఉందని, దానిని సమీపంలో ఉన్న వ్యక్తులు ఆక్రమించుకున్నారని చెప్పారు. ఇటువంటి స్థలాలను ప్రభుత్వం స్వాధీనం చేసుకుని ఉపాధి పనులు కల్పించాలని కోరారు. దీనిపై ఉప్పాడ సూర్యనారాయణ మాట్లాడుతూ అందరికీ ఉపాధి పనులు కల్పించేలా అధికారుల దృష్టికి తీసుకు వెళ్తామని, ఆక్రమణలపై కూడా తెలియజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమలో తోటపల్లి గ్రామానికి చెందిన సుమారు 50 మంది మహిళలు పాల్గొన్నారు.

తహసీల్దార్ దృష్టికి తీసుకువెళ్తాం

ప్రభుత్వ స్థలం ఆక్రమణపై వీఆర్వో పి.ఉషాను వివరణ కోరగా కొంగవానిపాలెం రెవెన్యూ పరిధిలోని సర్వే నెం.147లో 11నుంచి 16 సబ్ డివిజన్‌ల్లో సుమారు ఎకరా 16 సెంట్ల గయ్యాలు ఆక్రమణకు గురైనట్లు తన దృష్టికి వచ్చిందన్నారు. దీనిని ఇదివరకే పరిశీలించామని, దీనిపై తహసీల్దార్ దృష్టికి తీసుకు వెళ్తామని చెప్పారు.

వైసీపీ పదవులకు రామునాయుడు రాజీనామా

గంట్యాడ: బుడతనాపల్లి గ్రామానికి చెందిన రంధి రామునాయుడు వైసీపీ మండల అధ్యక్ష పదవికి, వ్యవసాయ సలహా మండలి అధ్యక్ష పదవికి మంగళవారం రాజీనామా చేశారు. ఈసందర్భంగా ఆయన మంగళవారం స్థానిక విలేఖర్లతో మాట్లాడారు. గ్రామ స్థాయిలో నెలకొన్న అంతర్గత విభేదాలతో తప్పనిసరి పరిస్థితిల్లో వైసీపీ నుంచి తప్పుకుంటున్నాని తెలిపారు. గ్రామ స్థాయి కార్యకర్తలతో మాట్లాడి, తదుపరి నిర్ణయం తీసుకుంటామని చెప్పారు.

భూ ఆక్రమణపై విచారణ


విచారణ చేస్తున్న డీఆర్వో, ట్రైనీ కలెక్టర్

గంట్యాడ: నరవ గ్రామంలో ఏఎంజీ కాలనీలో ప్రభుత్వ భూమి ఆక్రమణ జరిగిందంటూ నరవ గ్రామాని కి చెందిన సన్యాసిరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు డీఆర్వో అనిత, ట్రైనీ కలెక్టర్ వెంకట త్రివినాగ్ మంగళవారం సాయంత్రం విచారణ చేశారు. గ్రామానికి వచ్చి ఆ స్థలాన్ని పరిశీలించారు. ఈ నివేదికలను ఉన్నతాధికారులకు సమర్పిస్తామని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ నీలకంఠేశ్వరెడ్డి, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా పాఠశాల వార్షికోత్సవం


నృత్యం చేస్తున్న విద్యార్థినులు

బొబ్బిలి: పట్టణ పరిధిలోని గొల్లపల్లి వేణుగోపాల మున్సిపల్ హైస్కూల్లో మంగళవారం పదోతరగతి విద్యార్థుల వీడ్కోలు సభ ఘనంగా నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పాఠశాల వార్షికోత్సవంతో పాటు టెన్త్ విద్యార్థుల వీడ్కోలు సభ జరిగింది. ఈసందర్భంగా విద్యార్థులంతా అనేక సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించి కేరింతలు కొట్టారు. గంగాధర్ అనే రిటైర్డ్ ఇంగ్లీషు ఉపాధ్యాయుడికి పదో తరగతి విద్యార్థులంతా కృతజ్ఞతలు తెలుపుకుంటూ ఇంగ్లీషులో ఆకట్టుకునే లేఖను రాసి ఆయనకు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మద్యం స్వాధీనం

భోగాపురం: తూడెం గ్రామానికి చెందిన దువ్వు కొండమ్మ అనే మహిళ మద్యం తరలిస్తుండగా పట్టుకుని, అదుపులోకి తీసుకున్నామని ఎస్ఐ పి.సూర్యకుమారి మంగళవారం తెలిపారు. ముందస్తు సమాచారం మేరకు తనిఖీలు నిర్వహించి, నిందితురాలిని పట్టుకుని, 10 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నామని చెప్పారు.

శిశు మరణాలు తగ్గేలా దృష్టి సారించాలి

గరుగుబిల్లి: గ్రామాల్లో మాతా శిశు మరణాలు నిరోధానికి ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఇన్‌చార్జి పీడీ వై.సత్యంనాయుడు ఆదేశించారు. మంగళవారం స్థానిక వెలుగు కార్యాలయంలో గ్రామైఖ్య సంఘాలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. గతంలో మాతా శిశు మరణాల రేటు 24 శాతం ఉండేదని, ప్రస్తుతం 8 శాతానికి తగ్గుముఖం పట్టిందన్నారు. గ్రామైఖ్య సంఘాల సభ్యులు ఇంటింటికి వెళ్లి గర్భిణులకు పోషక పదార్థాలపై అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఏపీఎం పి.అప్పలనాయుడు, సీసీలు బి.రామినాయుడు, సీహెచ్ తిరుపతిరావు, ప్రసాద్, ఆర్.కృష్ణ, వి.లక్ష్మణరావు పాల్గొన్నారు.

వీధి దీపాల పరిశీలన


పనులను పరిశీలిస్తున్న డీపీవో శ్రీధర్‌రాజా

చీపురుపల్లి: పట్టణంలో వీధి లైట్ల ఏర్పాటు పనులను జిల్లా పంచాయతీ అధికారి ఎల్వీఎన్ శ్రీధరరాజా మంగళవారం పరిశీలించారు. మెయిన్ రోడ్డు, లావేరు రోడ్డు, విజయనగరం రోడ్లలో వీధి దీపాలను ఏర్పాటు చేసేందుకు ఇటీవల జడ్పీ ఛైర్మన్ రూ.5లక్షల నిధులు విడుదల చేశారు. ఈ మొత్తంతో చీపురుపల్లి గ్రామ పంచాయతీ వందకు పైగా లైట్లు కొనుగోలు చేసింది. ఈ లైట్ల ఏర్పాటును డీపీవో మంగళవారం పరిశీలించారు. ఆయన వెంట ఈవోపీఆర్డీ అన్నపూర్ణాదేవి, పంచాయతీ ఈవో ఝాన్సీ, శానిటరీ తనిఖీ అధికారి జి.వేణుగోపాలరావు, సిబ్బంది ఉన్నారు.

మానసాదేవి ఆలయ ధర్మకర్త నియామకం

చీపురుపల్లి: రామలింగపురం సమీపంలో ఉన్న మానసాదేవి ఆలయ ఏకసభ్య ధర్మకర్తగా దేవదాయ శాఖ తనిఖీ అధికారిణి పీవీ లక్ష్మి నియమితులయ్యారు. ఆ శాఖ ఉప కమిషనర్ ఆ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు. కాగా, ధర్మకర్తగా నియమితులైన ఆమె మంగళవారం ఆలయ ప్రాంగణంలో ప్రమాణం చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీకనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయ ఈవో జి.శ్రీనివాస్, ఆలయ మేనేజ్‌మెంట్ తరపున పిన్నింటి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఏపీటీఎఫ్ మండల అధ్యక్షుడిగా శ్రీనివాసరావు


ఏపీటీఎఫ్ నూతన కార్యవర్గం

నెల్లిమర్ల: ఏపీటీఎఫ్ నెల్లిమర్ల మండల కార్యవర్గ ఎన్నిక స్థానిక రామతీర్థం జంక్షన్ ప్రాథమిక పాఠశాలలో మంగళవారం జరిగింది. మండల అధ్యక్షుడిగా యు.శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శిగా కె.బాలకృష్ణ, గౌరవ అధ్యక్షుడిగా సీహెచ్ ఎర్రినాయుడు, అసోసియేట్ అధ్యక్షుడిగా వై.కృష్ణమూర్తి, ఉపాధ్యక్షులుగా కె.అప్పారావు, వి.శ్రీనివాసరావు, అదనపు కార్యదర్శిగా పి.మోహనరావు, కార్యదర్శిగా వై.సుజాత, ఎస్.బాబ్జీ, ఎస్.సింహాచలం ఎన్నికయ్యారు. సంఘం జిల్లా శాఖ అధ్యక్షుడు డి.ఈశ్వరరావు, రాష్ట్ర కార్యదర్శి ఎన్వీ పైడిరాజు, కె.చిన్నంనాయుడు, ఎం.రామకృష్ణ ఎన్నికల అధికారులుగా వ్యవహరించారు.

క్రీడలతో ఆత్మ విశ్వాసం


వాలీబాల్ పోటీలు నిర్వహిస్తున్న దృశ్యం

రాజాం: క్రీడల ద్వారా ఆత్మవిశ్వాసం పెరుగుతుందని ఆశయ యూత్ అసోషియేషన్ అధ్యక్షుడు రెడ్డి రమణ అన్నారు. మంగళవారం పురపాలక సంఘం పరిధిలోని సారధి గ్రామంలో రాజాం తాలుకా స్థాయి క్రీడాపోటీలు నిర్వహించారు. ఆశయ యూత్ అసోషియేషన్, భారత ప్రభుత్వ సంస్థ, జిల్లా నెహ్రూ యువకేంద్రం వారి ఆధ్వర్యంలో వాలీబాల్, పరుగు పందెం పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆశయ యూత్ అసోషియేషన్ అధ్యక్షుడు రెడ్డి రమణ మాట్లాడుతూ క్రీడా ఉత్తేజం ద్వారా వివిధ రంగాల్లో యువత రాణిస్తున్నారన్నా రు. గెలుపొందిన విజేతలకు ఆశయ సంస్థ అధ్యక్షుడు రమణ, పీడీ శేఖర్ చేతులమీదగా మొమెంటోలు, మెడల్స్ అందించారు.

పరీక్షలు బాగా రాయండి

కురుపాం: సమయం తక్కువగా ఉన్నందున సద్వినియోగం చేసుకొని ఏకాగ్రతతో పరీక్షలు రాసి ఉత్తమ ఫలితాలు సాధించాలని కురుపాం తహసీల్దార్ శంకరరావు టెన్త్ విద్యార్థులకు సూచించారు. కురుపాం జెడ్పీ ఉన్నత పాఠశాల స్పెషల్ ఆఫీస రుగా వ్యవహరిస్తున్న తహసీల్దార్ శంకరరావు.. పదో తరగతి విద్యార్థులు ఎలా చదవాలి? పరీక్షలలో భయపడకుండా ఎలా రాయాలి అనే విషయాలపై మంగళవారం సూచనలిచ్చారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం టి.శంకరరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. ● **భామిని:** పదో తరగతి వార్షిక పరీక్షలు ధైర్యంగా రాయాలని ఎంపీడీవో కిషోర్‌కుమార్ విద్యార్థులకు సూచించారు. మంగళవారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులాన్ని సందర్శించి పదో తరగతి పరీక్షలకు రాసే విద్యార్థులతో మాట్లాడారు. పరీక్షలు రాసేటప్పుడు ప్రశాంతంగా రాయాలన్నారు. ఆయనతో పాటు ప్రిన్సిపాల్ విజయనిర్మల, సిబ్బంది పాల్గొన్నారు. ● **గరుగుబిల్లి:** పదో తరగతి పరీక్షల్లో శత శాతం ఉత్తీర్ణతకు అవసరమైన చర్యలు చేపడుతున్నామని ఎంఈవో ఎన్.నాగభూషణరావు తెలిపారు. మంగళవారం ఉల్లిభద్ర జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు పరీక్షల నిర్వహణపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వెనుకబడి ఉన్నవారికి ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నామని చెప్పారు. పరీక్షలపై భయం పోగొట్టే విధంగా విద్యార్థుల్లో చైతన్యం తీసుకువస్తున్నామన్నారు. ఉపాధ్యాయులు ప్రత్యేక చొరవ చూపాలన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం పీసీహెచ్ శ్రీనివాసరావు, తదితరులు ఉన్నారు.

పరీక్ష కేంద్రాల పరిశీలన

వీరఘట్టం: మండలంలోని బిటివాడ పదో తరగతి పరీక్షా కేంద్రాన్ని తహసీల్దార్ కె.జయప్రకాష్ మంగళవారం పరిశీలించారు. ఈనెల 18 నుంచి 27వరకు పదో తరగతి పరీక్షలు జరగనున్నందున పరీక్షా కేంద్రంలో గదులను తనిఖీ చేసి హెచ్ఎం రత్నాకర్‌రావుకు సూచనలు చేశారు. విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం జరగకుండా చూడాలన్నారు. ఎంపీడీవో ఎంవీబీ సుబ్రహ్మణ్యం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి

సాలూరు రూరల్: పదో తరగతిలో శతశాతం ఫలితాలను సాధించాలని ఎంఈవో 1, పెదబోరబంద జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రత్యేకాధికారి బి.రాజకుమార్ పిలుపునిచ్చారు. మంగళవారం ఆయన పెదబోరబంద ఉన్నత పాఠశాలను పరిశీలించారు. పదో తరగతి విద్యార్థులతో మాట్లాడుతూ సరైన ప్రణాళికతో సన్నద్ధమయితే పరీక్షలు బాగా రాయవచ్చని చెప్పారు. హెచ్ఎం మురళీకృష్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్లుప్తంగా..

రంజాన్ మాసం ఆరంభం


జామియా మసీదులో ఉపవాస దీక్ష విరమిస్తున్న ముస్లింలు

బొబ్బిలి: పవిత్ర రంజాన్ మాసం ప్రారంభం సందర్భంగా ముస్లిం సోదరులు భక్తి శ్రద్ధలతో తమ ఆచారాన్ని పాటించారు. స్థానిక జామియా మసీదులో మంగళవారం సాయంత్రం ఇఫ్తార్ ఉపవాస దీక్షను విరమించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ముస్లింలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే కేసులు


మద్దువలసలో వాహనాలు తనిఖీ చేస్తున్న దృశ్యం

వంగర: వాహన యజమానులు నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని ఎస్ఐ జనార్దనరావు హెచ్చరించారు. మంగళవారం మద్దువలస కూడలిలో వాహన తనిఖీలు నిర్వహించారు. నిబంధనలు పాటించని వాహన చోదకులకు అపరాధ రుసుం విధించారు.

పోలింగ్ స్టేషన్ల పరిశీలన

లక్కవరపుకోట (కొత్తవలస): మండలంలోని ఎనిమిది పంచాయతీలలో గల పోలింగ్ స్టేషన్లను జోనల్ అధికారి ఉమామహేశ్వరరావు మంగళవారం పరిశీలించారు. ముసిరాం, దేవాడ, కోనమసివానిపాలెం, వియ్యంపేట, వి.బి.పురం, మునగపాకవానిపాలెం గ్రామాల్లో పోలింగ్ బూత్‌లను పరిశీలించారు. విజయనగరం దిశా పోలీసు స్టేషన్ అధికారి నరసింహారావు, రూట్ ఆఫీసర్ సత్యనారాయణ తదితరులు ఆయన వెంట ఉన్నారు.

సంగమేశ్వర ఆలయంలో పూజలు

వంగర: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం సంగాంలో శివరాత్రి జాతరకు ఐదో రోజు మంగళవారం భక్తులు పోటెత్తారు. త్రివేణి సంగమ ప్రాంతంలో స్నానాలు ఆచరించి సంగమేశ్వర దర్శనానికి బారులు తీరారు. త్రివేణి సంగమంలో స్నానాలకు నీరు లేక భక్తులు ఇబ్బందులు పడ్డారు. స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో ఆలయ ప్రాంగణంలో అన్న సమారాధన చేశారు. ఈ కార్యక్రమంలో ఈవో శ్యామలరావు, ప్రధాన అర్చకులు గణపతిరావు పాల్గొన్నారు.